క్లుప్తంగా

వాటర్ ప్లాంట్ ప్రారంభం



దొడ్లేరు(క్రోసూరు): దొడ్లేరు గ్రామంలోని షాదీఖానా వద్ద ప్రాజెక్ట్ అమ్రిత్ ఆధ్వర్యంలో ఐ ప్యూర్ సురక్షిత తాగునీటి ప్లాంట్‌ను సోమవారం ప్రారంభించారు. ప్రాజెక్ట్ అమ్రిత్ సీఈవో దివ్య, గ్రామ సర్పంచ్ ముక్కు అంజలి పాల్గొన్నారు. దివ్య మాట్లాడుతూ సురక్షితమైన తాగునీరు అందించే అత్యాధునిక టెక్నాలజీ కలిగిన సంస్థ సహకారంతో ప్లాంట్ ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ప్రజలందరూ తాగునీటిని సద్వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో విలాసిని, దుర్గాప్రసాద్, శ్రీనివాస్, తిలక్, అమిత్, గుడిపాడు బాషా, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల మృతి బాధాకరం



సత్తెనపల్లి: సరదాగా స్నేహితులతో కలిసి ఈతకెళ్లిన విద్యార్థులు మృతి చెందడం బాధాకరమని వైఎస్సార్ సీపీ నాయకుడు చిట్టా విజయ భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని వడ్డవల్లి శాస్త్రీ నగర్‌కు చెందిన నల్లూరి గోపీచంద్ స్వగృహంలో సోమవారం మృతదేహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. మట్టి ఖర్చుల నిమిత్తం తల్లిదండ్రులకు రూ.5 వేలు అందజేశారు. తల్లిదండ్రులు కిరణ్ కుమార్, సుహాసినిని ఓదార్చి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. అండగా ఉంటామని వారికి భరోసా కల్పించారు. 11, 24 వార్డుల కౌన్సిలర్లు గుజ్జర్లపూడి సతీష్, అచ్యుత శివప్రసాద్ తదితరులున్నారు.

మిర్చిలో బొబ్బర తెగులు



అమరావతి: మిర్చి పంటకు బొబ్బర తెగులు సోకి రైతులు ఇబ్బందులు పడుతున్నారని మండల వ్యవసాయాధికారి అహ్మద్ తెలిపారు. సోమవారం రైతులకు నివారణ సూచనలిచ్చారు. నేలలో తేమ కారణంగా బొబ్బర తెగులు వచ్చే అవకాశం ఉందన్నారు. తెగులు సోకిన రెండుమూడు రోజుల్లోనే మొత్తం పైరుకు అశించే పరిస్థితి ఉంటుందన్నారు. తెగులు నివారణకు చేల గట్ల మీద కలుపు మొక్కలు పీకివేసి, సిఫార్సు మేరకే నత్రజని, పొటాష్ ఎరువులను వాడాలన్నారు.

బీజేపీ మండలాధ్యక్షుడిగా వాడపర్తి పుల్లారావు




అమరావతి: భారతీయ జనతాపార్టీ మండల అధ్యక్షుడిగా అమరావతికి చెందిన వాడపర్తి పుల్లారావు ఎంపికయ్యారు. సోమవారం స్థానిక గోపాల్‌నగర్‌లో పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆలోకం సుధాకర్ అధ్వర్యంలో మండల కార్యనిర్వాహక సమావేశం నిర్వహించారు. పుల్లారావు మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. తన ఎంపికకు సహకరించిన జిల్లా అధ్యక్షుడు సుధాకర్, ఎంపీపీ మేకల హనుమంతరావు, పార్టీ నాయకులు మద్ది ధాత్రినారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నాయకులు మేకల శివశంకర్, నల్లిబోయిన బసవయ్య, గోగినేని వెంకటరమణ, సాయిబాబు అభినందించారు.

పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల తుది జాబితా

ముప్పాళ్ళ: మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల జాబితాలు అందుబాటులో ఉంచినట్లు తహసీల్దార్ ఎం.భవానిశంకర్ సోమవారం తెలిపారు. మండలంలోని 40 పోలింగ్ కేంద్రాల వద్ద జాబితా అందుబాటులో ఉందని, అభ్యంతరాలుంటే సంబంధిత బీఎల్ఓ దృష్టికి తీసుకురావచ్చన్నారు.

ప్రకృతి వ్యవసాయం ఉత్పత్తుల స్టాల్ ఏర్పాటు



ముప్పాళ్ళ: ప్రకృతి వ్యవసాయంతో పండించిన కూరగాయలు, ఆకు కూరల స్టాల్‌ను సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఎంపీడీవో పీజే విలియమ్స్ స్టాల్‌ను పరిశీలించి, కూరగాయలను కొనుగోలు చేశారు. ప్రతి సోమవారం స్టాల్ ఏర్పాటు చేస్తామని నిర్వాహకులు కె.పూజ, కె.సౌజన్య తెలిపారు. ఈఓపీఆర్డీ రూపవతి, డీఆర్‌డీఏ స్టాఫ్ కూరగాయలు కొనుగోలు చేశారు.

భూ సమస్యలు..
పరిష్కరింపని..సతుస్సులు

రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తామని ఊదర గొట్టిన కూటమి ప్రభుత్వం.. వాటిని చివరకు మొక్కుబడి తంతుగా మార్చేసింది. భూ సమస్యలపై వందల్లో ఫిర్యాదుల అందినా.. పరిష్కారం నూరుశాతం కనపించడం లేదు. దీంతో బాధితులు ఉసురుమంటూ మళ్లీ తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాల్లో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు పోటెత్తుతున్నారు.

- మొక్కుబడిగా ముగిసిన రెవెన్యూ సదస్సులు
- అర్జీలకు కనీసం రసీదులు ఇవ్వని వైనం
- రెవెన్యూ సమస్యలపై అందిన 775 అర్జీలు
- దీర్ఘకాలిక సమస్యల జోలికెళ్లిన అధికారులు
- రేషన్ కార్డులు, పింఛన్లకు దరఖాస్తుల వెల్లువ



రెంటపాళ్లలో తహసీల్దార్ చక్రవర్తికి వినతి పత్రం అందిస్తున్న సీపీఎం నేత పెండ్యాల మహేష్‌షైల్

సత్తెనపల్లి: నియోజకవర్గంలోని సత్తెనపల్లి పట్టణం, రూరల్, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు మండలాల్లో 47 రెవెన్యూ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. గత డిసెంబర్ 6 నుంచి ఈ నెల 4వ తేదీ వరకు నిర్వహించిన రెవెన్యూ సదస్సులో కేవలం రెవెన్యూకు సంబంధించిన సమస్యలపై నియోజకవర్గవ్యాప్తంగా 775 అర్జీలు అందాయి. ఇందులో 531 అర్జీలను మాత్రమే పరిష్కరించినట్లు అధికారికంగా లెక్కలు చెబుతున్నాయి. మరో 244 అర్జీలు పెండింగ్‌లో ఉండటం విశేషం. సత్తెనపల్లి నియోజకవర్గంలో భూ సమస్యలు అధికంగా ఉన్నాయి. మ్యుటేషన్, సర్వే, కొలతల్లో వ్యత్యాసం, అడంగల్‌లో మార్పులు, నూతన పాస్ పుస్తకాలు, పేర్లు మార్పిడి, ఆక్రమణలు, వారసత్వం, తదితర భూ సమస్యలపై ప్రజల అర్జీలు అందజేశారు. ఈ సదస్సులతో రైతులకు, ప్రజలకు పెద్దగా ఒనగూరిందేమీ లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రెవెన్యూ సదస్సుల్లో అధికారులు ఎక్కువగా స్థానిక సమస్యలకే ప్రాధాన్యమిచ్చారు. దీర్ఘకాలికంగా తిష్ట వేసిన రెవెన్యూ సమస్యలపై అధికారులు స్పందన పెద్దగా లేదని తెలుస్తోంది.

తూతూ మంత్రంగా

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన భూ సంస్కరణలను నిలిపి వేసిన కూటమి ప్రభుత్వం.. వాటిపై విషం చిమ్మేందుకు రెవెన్యూ సదస్సులను చేపట్టిందనే విమర్శలు ఉన్నాయి. రెవెన్యూ సదస్సుల్లో దీర్ఘకాలికంగా ఉన్న భూ సమస్యలపైనే అర్జీలు ఎక్కువగా వచ్చాయి. కొన్ని సమస్యలను పరిష్కరించే అవకాశం ఉన్నా.. ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టిన దాఖలాలు లేవని బాధితులు వాపోతున్నారు. అర్జీల పరిష్కారానికి 45 రోజుల గడువు విధించడంతో మళ్లీ తహసీల్దార్ కార్యాలయాలు, వీఆర్వోలు, సర్వేయర్ల చుట్టూ రోజుల తరబడి తిరిగే బాధ తప్పేలా లేదని ప్రజలు వాపోతున్నారు. రెవెన్యూ సదస్సులో భూములకు సంబంధించినవి మాత్రమే కాకుండా సర్వే, రైస్ కార్డులు, పెన్షన్లు, ఇళ్ల స్థలాలు తదితర వాటికి ప్రతి మండలం నుంచి వేల సంఖ్యలో అర్జీలు అందాయి. రైస్ కార్డులకు ఒక సత్తెనపల్లి మండలంలోనే 1,678 అర్జీలు వచ్చాయి. ఇంతవరకు ప్రభుత్వం రైస్ కార్డులకు, పెన్షన్లకు, ఇళ్ల స్థలాలకు అధికారికంగా సైట్ ఓపెన్ చేయకపోవడంతో ఆయా అర్జీలను సంబంధిత శాఖలకు పంపారు.

అర్జీలకు రసీదులు లేవు

రెవెన్యూ సదస్సులకు వచ్చిన అర్జీలు, పరిష్కరించిన సమస్యలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయాలని ప్రభుత్వం ఆదేశించింది. రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలపై ప్రజలు అందజేసే ప్రతి అర్జీకి రసీదు ఇచ్చి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. కానీ అధికారులు ఎటువంటి రసీదులు ఇవ్వకుండా అర్జీలను తీసుకొని వెళ్లారు. దీంతో తమ అర్జీల పరిస్థితి ఏమిటని దరఖాస్తుదారులు మదన పడుతున్నారు.

సత్తెనపల్లి నియోజకవర్గంలో రెవెన్యూ సమస్యలపై వచ్చిన అర్జీలు

మండలం	రెవెన్యూ గ్రామాలు	వచ్చిన అర్జీలు	పరిష్కరించినవి	పెండింగ్
సత్తెనపల్లి	19	182	105	77
ముప్పాళ్ళ	10	205	164	41
రాజుపాలెం	08	257	184	73
నకరికల్లు	10	131	78	53
మొత్తం	47	775	531	244

భక్త భీష్ట ప్రదాత అలంకరణలో శ్రీవారు



సత్తెనపల్లి: ధనుర్మాసాన్ని పురస్కరించుకుని పట్టణంలోని రైల్వే స్టేషన్‌రోడ్‌లో గల శ్రీ అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవారికి భక్త భీష్ట ప్రదాత అలంకరణ చేసి, పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, దర్శించుకున్నారు. శ్రీవారి సేవా సమాజం ఏర్పాట్లను పర్యవేక్షించింది.

విద్యార్థికి ల్యాప్‌టాప్ వితరణ



అచ్చంపేట: కోనూరుకు చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి బొగ్గవరపు వెంకటసాయి ప్రాజెక్టు వర్క్ నిమిత్తం మాగులూరి ఫౌండేషన్ సోమవారం సోషల్ వర్కర్ వేగుంట రాణి చేతుల మీదుగా రూ.40 వేలు వలువ చేసే ల్యాప్‌టాప్ అందజేసింది. ప్రవాసాంధ్రులు మాగులూరి భానుప్రకాష్ ఫౌండేషన్‌ను స్థాపించి పేద విద్యర్థులకు ఆసరాగా నిలుస్తున్నారని సభ్యులు కొనియాడారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయులు గోళ్లమూడి పాపారావు, తాళ్లూరి మురళి, విద్యార్థి తల్లిదండ్రులు ఉన్నారు.

వసతి గృహాలపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న శంకరరావు

రాజుపాలెం: ప్రభుత్వ వసతి గృహాలపై నిరంతరం అధికారుల పర్యవేక్షణ ఉండాలని నేషనల్ యాంటీ క్రైమ్ అండ్ హ్యూమన్ రైట్స్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఇన్‌చార్జి గరికపాటి శంకరరావు కోరారు. మండలంలోని కొండమోడులో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అనాథ పిల్లలు, వృద్ధుల ఆశ్రమంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వ వసతి గృహాల్లో సరైన వసతులు లేక విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురి అతున్నారని తెలిపారు. శీతాకాలం దుప్పట్లు లేక అల్లాడుతున్నారని, కాస్మోటిక్ చార్జీలు ప్రతి నెలా క్రమం తప్పకుండా అందించాలని డిమాండ చేశారు. ట్రంక్ పెట్టెలు కూడా ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొన్ని వసతి గృహాల్లో కనీస సౌకర్యాలు, సరిపడ గదులు లేవన్నారు. మరుగుదొడ్లు అధ్వానంగా తయారయ్యాయని చెప్పారు. ఇప్పటికైన అధికారులు స్పందించి ప్రభుత్వ వసతి గృహాలపై దృష్టి పెట్టాలని కోరారు.

పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకోవాలి

సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, పక్కన ఎమ్మెల్సీ రామకృష్ణ, ఆలపాటి

సత్తెనపల్లి: ప్రతిభావంతులు ఓటు హక్కు వినియోగించుకోవాలని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని రఘురామ్ నగర్‌లో ఉన్న వెంకటేశ్వర గ్రాండ్ కల్యాణ మండపంలో ఉమ్మడి కృష్ణ, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గ ఆత్మీయ సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విద్యా వంతులు, మేధావులు ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. గ్రామస్థాయి నుంచి పార్టీ సభ్యత్వాన్ని బలోపేతం చేయాలని, ఆరు నెలల్లోనే అభివృద్ధి అంటే ఏంటో చూపించామన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజా మాట్లాడుతూ విద్యా వ్యవస్థల్ని నాశనం చేసిన ఘనత గత ప్రభుత్వానికి చెందుతుందన్నారు. గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఎమ్మెల్సీ రామకృష్ణ, పరిశీలకులు వేములకొండ శ్రీనివాస్ మాట్లాడారు. అనంతరం గుడిపూడి గ్రామంలో సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ శంకుస్థాపన చేశారు.

మృతదేహాల సందర్శన...

పట్టణానికి చెందిన. తొమ్మిదవ తరగతి విద్యార్థులు పాదిలి చరణ్, నల్లూరి గోపీచంద్ ఆదివారం ఈతకు వెళ్లి మృతి చెందారు. ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో ఉన్న మృతదేహాలను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సందర్శించి నివాళులర్పించారు. మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు.

సత్తెనపల్లి ఓటర్లు 2,42,143 తుది జాబితా విడుదల చేసిన అధికారులు



తుది జాబితా విడుదల చేస్తున్న కమిషనర్ షమ్మీ, టీపీఎస్‌లు సునీత, రిజ్వానా

సత్తెనపల్లి: ఓటర్ల సవరణ ప్రక్రియ–2025 పూర్తి కావడంతో అధికారులు తుది ఓటరు జాబితాను నియోజకవర్గంలోని అన్ని తహసీల్దార్ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయం, సచివాలయాలు, పోలింగ్ కేంద్రాల్లో సోమవారం విడుదల చేశారు. నియోజకవర్గంలో 2,42,143 మంది ఓటర్లు ఉన్నట్లు తేల్చారు. 2024 అక్టోబర్ 29న డ్రాఫ్ట్ పబ్లికేషన్‌కు ప్రస్తుతం సవరణ ప్రక్రియ పూర్తయాక 3,056 మంది ఓటర్లు పెరిగినట్లు తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ కొలిమి షమ్మీ మాట్లాడుతూ పట్టణంలో 48,003 మంది ఓటర్లు ప్రస్తుతం ఉన్నారని, గత డ్రాఫ్ట్ పబ్లికేషన్‌తో పోలిస్తే 681 మంది పెరిగారన్నారు. పురుషులు 23,157 మంది ఉంటే మహిళలు 24,841 మంది, ఇతరులు ఐదుగురు ఉన్నారన్నారు. కార్యక్రమంలో టీపీఎస్‌లు సునీత, రిజ్వానా తదితరులు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయ రైతులను ప్రోత్సహించాలి



ఉత్పత్తులను రైతులకు అందిస్తున్న తహసీల్దారు కె.పుల్లారావు

నకరికల్లు: ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు తీసుకోడం ద్వారా ఆరోగ్యకరంగా జీవించవచ్చని తహసీల్దార్ కె.పుల్లారావు పేర్కొన్నారు. జెడ్‌బీఎన్‌ఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను సోమవారం ఏర్పాటు చేశారు. స్టాల్‌ను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. జీరో బడ్జెట్ నాచురల్ ఫార్మింగ్ చేసే రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. ఏటీఎం పద్ధతిలో సాగుచేసిన ఆకు కూరలు, కూరగాయలను వినియోగదారులకు అందుబాటులోకి తెచ్చిన రైతులను అభినందించారు. మహిళా మార్ట్, రైతు బజార్‌లో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు అందుబాటులో ఉంటున్నాయని వినియోగదారులు కొనుగోలు చేసి రైతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు, రైతు వెంకటరమణ, వీఏఏ సుభాని, ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జిలు రామసుబ్బారెడ్డి, రేణుక, డీఎంఎంటీ రవి, కై పు రవీంద్రారెడ్డి, సర్పంచ్ మునిసింగ్ నాయక్ పాల్గొన్నారు.

పొన్నూరు పోలీసులపై చర్యలకు డిమాండ్



న్యాయ దేవత విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

సత్తెనపల్లి: పొన్నూరు బార్ అసోసియేషన్ సభ్యుడు, న్యాయవాది భేతాళ ప్రకాశరావు పట్ల వ్యవహరించిన తీరుకు పొన్నూరు పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సత్తెనపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కంబాల అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా బార్ ఫెడరేషన్ పిలుపులో భాగంగా సత్తెనపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాలుగు కోర్టుల్లో న్యాయవాదులు సోమవారం విధులు బహిష్కరించి, న్యాయదేవత విగ్రహం వద్ద నినాదాలు చేశారు. న్యాయవాదులు మాట్లాడుతూ న్యాయవాది భేతాళ ప్రకాశరావును పొన్నూరు పోలీసులు నిర్బంధించి వాతలు తేలే విధంగా దాడి చేసినా.. చర్యలు తీసుకోకుండా బాధిత న్యాయవాది పైనే కేసు నమోదు చేయడాన్ని బార్ అసోసియేషన్ తరుపున తీవ్రంగా ఖండించారు. పోలీసు ఉన్నత అధికారులు స్పందించాలని, వెంటనే పొన్నూరు పోలీసుల పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులు చిట్టా విజయభాస్కరరెడ్డి, బి.ఎల్ చిన్నయ్య, బత్తిన శ్రీనివాసబాబు, దివ్వెల శ్రీనివాసరావు, కాకర్ల హరిబాబు, చావా బాబురావు, బీఎల్ కోటేశ్వరరావు, జొన్నలగడ్డ విజయ్ కుమార్, రాజవరపు నరసింహరావు, షేక్ జానీఖాజావలి, వడియాల పాపారావు, కోట సాంబశివరావు, యర్రమాసు వెంకటేశ్వర్లు ఉన్నారు.

ఆటోలే శరణ్యం..నడకే మార్గం

- క్రోసూరు ఆదర్శ పాఠశాల విద్యార్థులకు తప్పని పాట్లు
- నిర్ణీత సమయాల్లో బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు
- ఆటోలు, ప్రైవేట్ వాహనాల్లో చేరుకుంటున్న వైనం
- బడి గమ్యానికి పేద విద్యార్థులకు తప్పని ఖర్చు



ఏపీ మోడల్ స్కూల్

క్రోసూరు: మండల కేంద్రం నుంచి సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో 2013లో ఆదర్శ పాఠశాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కానీ, విద్యార్థులు పాఠశాలకు చేరుకోవడానికి సమయానికి బస్సు సౌకర్యం కల్పించలేదు. దీంతో అధిక చార్జీలు పెట్టుకుని ఆటోలు, ద్విచక్రవాహనాల్లో విద్యార్థులు పాఠశాలకు చేరుకుంటున్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి క్రోసూరు మండలానికి ఏపీ మోడల్ స్కూల్‌ను 2008లో మంజూరు చేశారు. 2013లో పాఠశాలను ప్రారంభించారు. ఆ తర్వాత మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఆదర్శ పాఠశాలలో అదనంగా జూనియర్ కళాశాల ఏర్పాటు చేశారు. ఆరవ తరగతి నుంచి ఇంటర్‌మీడియట్ వరకు తరగతులు ప్రారంభించారు. ప్రస్తుతం తరగతికి 100 మంది విద్యార్థులకు అవకాశం కల్పించారు. ఏటా 6వ తరగతిలో ప్రవేశ పరీక్ష ద్వారా సీట్లు కేటాయిస్తున్నారు. ప్రత్యేక హాస్టల్ వసతి కూడా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం పాఠశాలలో 715 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. దీంతోపాటు ఐదు కిలోమీటర్ల దూరం నుంచి వచ్చే ఆడ పిల్లలు వందమందికి హాస్టల్ సౌకర్యం కల్పించారు.



ఆటో కోసం వేచి ఉన్న, నడిచొస్తున్న విద్యార్థినులు

పాఠశాలకు చేరుకోవాలంటే ఇక్కట్లు..

ఆదర్శ పాఠశాలలో అమరావతి మండలం మునుగోడు, సుమారు 7 కిలోమీటర్ల దూరం ఉన్న గ్రామాల నుంచి విద్యార్థులు రోజూ వచ్చి చదువుకుంటున్నారు. అమరావతి వైపు నుంచి వచ్చే విద్యార్థులు క్రోసూరు నాలుగు రోడ్ల సెంటర్‌లో బస్సు మారాల్సి ఉంది. పిడుగురాళ్ల నుంచి వచ్చే విద్యార్థులకు సమయానికి బస్సు సౌకర్యం లేదు. అదనపు చార్జీలు పెట్టుకుని ఆటోల్లో పాఠశాలకు చేరుకుంటారు. కొంతమంది విద్యార్థులు తమ తల్లిదండ్రుల దిచక్రవాహనాల ద్వారా పాఠశాలకు చేరుకుంటున్నారు.

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం



పాఠశాలకు చేరుకునేందుకు విద్యార్థుల పడుతున్నట్లు ఇబ్బందులు వాస్తవం. ఈ విషయాన్ని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ దృష్టికి తీసుకెళ్లాం. సమస్య పరిష్కస్తామని ఆయన చెప్పారు.

– ఎం.గణేష్, ఎంఈవో–2, క్రోసూరు

బస్సు సౌకర్యం కల్పించాలి



పాఠశాల సమయానికి విద్యార్థులు చేరుకునేందుకు, సాయంత్రం సత్తెనపల్లి, పిడుగురాళ్ల వైపు నుంచి బస్సు పౌకర్యం కల్పించాలి. ఆర్టీసీ అధికారులు తగిన చొరవ చూపాలి.

– మేరీసుజన్, ప్రిన్సిపల్, ఆదర్శ పాఠశాల

బస్సు సమయానికి ఉండదు



నేను 8వ తరగతి చదువుతున్నాను. పిడుగురాళ్ల నుంచి క్రోసూరు వచ్చే బస్సు సమయానికి ఉండదు. ఆటోలో పాఠశాలకు వస్తున్నాం. బడి విడిచి పెట్టిన తర్వాత బస్సు కోసం ఎదురు చూపులు తప్పడం లేదు.

– జి.అభిషేక్, విద్యార్థి, 8వ తరగతి, పెరికపాడు

ఫీజులు చెల్లించమని ఒత్తిడి చేస్తున్నారు



డీఆర్వో మురళికి వినతిపత్రం అందజేస్తున్న బీసీ సంఘాల నాయకులు

సత్తెనపల్లి: ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు పేద విద్యార్థులు ఫీజులు చెల్లించమని వారి తల్లిదండ్రులను ఒత్తిడి చేస్తున్నాయని, న్యాయం చేయాలని బీసీ సంఘాల నాయకులు కోరారు. సోమవారం జిల్లా రెవెన్యూ అధికారి మురళికి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ సత్తెనపల్లి పట్టణానికి చెందిన పలువురు బీసీ విద్యార్థులు విద్య హక్కు చట్టం–2009 ప్రకారం ఉచిత ప్రవేశం పొందారని తెలిపారు. ఇటీవల ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు విద్యాహక్కు చట్టం జీవోను ఎత్తివేయాలని హైకోర్టును ఆశ్రయించాయని, దీనిని ఆసరాగా చేసుకుని ఫీజులు చెల్లించమని ఒత్తిడి చేస్తున్నట్లు తెలిపారు. నాయకులు ప్రత్తిపాటి హరేకృష్ణ, తొరటి వెంకట్రావు, గుంటూరు గోవిందు, గుంజి విజయ్‌కుమార్, పీక్కిలి శివ, కుమ్మరి దస్తగిరి, మోదుగుల బాబ్జీ, పిల్లకతువుల నాగేశ్వరరావు, చింకా అంకమ్మరావు, మంగళపురి నాగేశ్వరావు ఉన్నారు.

నేడు పింఛన్ల వెరిఫికేషన్

క్రోసూరు: మంచానికే పరిమితమై పింఛన్ పొందుతున్న 15 మంది లబ్ధిదారుల వివరాలను ఎంపీడీవో జి.శ్రీనివాస్ సోమవారం తెలిపారు. వీరి వాస్తవ పరిస్థితి పరిశీలించేందుకు మంగళవారం డాక్టర్ల బృందం హాజరుకానున్నట్లు ఆయన పేర్కొన్నారు. అందుకూరు– మచ్చా శివకుమార్, దోసకమల వెలుగులక్ష్మీ, అనంతవరం – పగిడిపాటి ఉపేంద్రమ్మ, ఆవులవారిపాలెం– బిక్షానాయక్, పి.ఏడు కొండలు, దొడ్లేరు– డి.కుమారి, ముజావర్ మౌలాలి, మువ్వా గోదానంద కృష్ణ, హసనాబాద్ – పఠాన్ సుభాన్‌ఖాన్, క్రోసూరు సయ్యద్ జాన్‌సైదా, షేక్ నాగుల్ షరీఫ్, నాగవరం– కుంటిల వెంకయ్య, కొమ్ము వెంకయ్య, 88త్యాళ్లూరు– పల్లెవెంకటేశ్వర్లు, మెడంపెట్టి వెంకట్రావు ఉన్నట్లు తెలిపారు.

సీపీఎస్ సమస్యలపై వినతి

క్రోసూరు: ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మల్లు రఘునాథరెడ్డికి సీపీఎస్ సమస్యలపై ఆదివారం వినతి పత్రం అందచేసినట్లు సీపీఎస్ ఎస్టీయూ జిల్లా కన్వీనర్, హెచ్ఎం టి.శరత్‌కుమార్ సోమవారం తెలిపారు. పెండింగ్‌లో ఉన్న నెలవారి మ్యాచింగ్ గ్రాంట్‌లను ప్రాన్ ఖాతాలకు తక్షణమే చెల్లించాలని కోరారు.